సాక్షి
కాకినాడ
సోమవారం। 11 । సెప్టెంబర్ । 2023



రూ.1.01 లక్షల విరాళం

అమలాపురం టౌన్: వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద అర్చకుల వసతి గృహాలకు పెద్దింటి వెంకట తిరుపతిరాజు కుటుంబీకులు (అమలాపురం) ఆదివారం రూ.1,01,000 విరాళం సమర్పించారు.



నిత్యాన్నదానానికి..

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదానానికి బల్ల శ్రీహరి, మంగతాయారు దంపతులు (నర్సాపురం మండలం చిన మామిడిపల్లి) ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.

లోవ దేవస్థానానికి..



తుని రూరల్: లోవ దేవస్థానంలో కొలువైన తలుపులమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి వెలివెల సీతారామాంజనేయ ప్రసాద్, ఆయన భార్య లక్ష్మీనాగరాజ్యం, కుమారుడు శ్రీగణ సాయి సమీర్ (తుని) ఆదివారం రూ.1,00,007 విరాళం సమర్పించారు.

ఆనంద సాగరం



ద్వాక్రా సంఘాల ప్రతినిధుల సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి, సెర్ప్ డీపీఎంలు, సీసీలు

- సెర్ప్ ఉద్యోగులకు పెరిగిన జీతాలు
- ఈ నెలలోనే వారి ఖాతాల్లోకి..
- బేసిక్‌పై 23 శాతం పెంపు
- ఉమ్మడి జిల్లాలో 219 మందికి లబ్ధి

కాకినాడ సిటీ: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యాన పని చేస్తున్న గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం జీతాలు పెంచింది. సెర్ప్ పరిధిలోని వైఎస్సార్ క్రాంతి పథంలో పని చేసే ఉద్యోగులు స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ఉన్నతికి విశేష కృషి చేస్తున్నారు. వీరి జీతాలు పెంచుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జీఓ 64 విడుదల చేసింది. బేసిక్‌పై ఏకంగా 23 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. పెరిగిన జీతాన్ని ఆగస్టు 10వ తేదీ నుంచి వర్తింపజేస్తున్నట్టు ఆ జీఓలో పేర్కొన్నారు. దీంతో పెరిగిన జీతం ఈ నెలలో చేతికి అందడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎంతో కీలకం

డీఆర్‌డీఏ – వెలుగు క్రాంతి పథకంలోని ఎస్‌హెచ్‌జీల అభివృద్ధిలో సెర్ప్ ఉద్యోగులు కీలకంగా ఉన్నారు. వీరిలో డిస్ట్రిక్ ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం), అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ (ఏపీఎం), కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు (సీసీ), అడ్మిన్ అసిస్టెంట్లు (ఏఏ) 219 మంది ఉన్నారు. వీరిలో చాలా మంది 2002 నుంచి కూడా పని చేస్తున్నారు. వాణిజ్య బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడంతో పాటు వాయిదాలు కట్టించడం, స్త్రీనిధి బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించడంతో పాటు ఆయా ఎస్‌హెచ్‌జీ గ్రూపుల వ్యాపారాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు. ప్రభుత్వ పథకాలైన జగనన్న తోడు, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ, జగనన్న పాల వెల్లువ, ఉన్నతి వంటి పథకాలను మహిళల వద్దకు తీసుకుని వెళ్లి, వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్నారు. వారి వ్యాపారాలకు మార్కెటింగ్ అవకాశాలు పెంచేందుకు కృషి చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో ఉండే విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్‌ను (వీఓఏ – యానిమేటర్లు) సమన్వయం చేసుకుని సంఘాల ఉన్నతికి కృషి చేస్తున్నారు.

సీఎం జగన్‌కు ఉద్యోగుల కృతజ్ఞతలు

వీరు కొన్నేళ్లుగా తమ జీతాలు పెంచాలని కోరుతూ వస్తున్నారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దీంతో జిల్లాలో డీపీఎం, ఏపీఎం, సీసీ, ఏఏలకు జీతాలు పెరిగాయి. బేసిక్‌పై ఒక్కొక్కరికి రూ.4 వేల నుంచి రూ.12 వేల వరకూ పెరిగింది. సెర్ప్ ఉద్యోగులకు గతంలో ఉద్యోగ భద్రత కల్పించింది నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కావడం విశేషం. అప్పట్లో వైఎస్సార్ ఉద్యోగ భద్రత కల్పించగా, ఆయన తనయుడు జగన్ 23 శాతం జీతాలు పెంచి తోడ్పాటు అందించారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సెర్ప్ ఉద్యోగుల సమాచారం

ప్రాజెక్ట్ మేనేజర్ (పీఎం)	:	1
డీపీఎంలు	:	10
ఏపీఎంలు	:	27
సీసీలు	:	99
ఎంఎస్‌సీసీలు	:	50
కార్యాలయ సిబ్బంది	:	32

పెరిగిన జీతం

కేడర్	ఉద్యోగుల సంఖ్య	పాత జీతం	పెరిగిన జీతం
డీపీఎం	10	53,790	66,162
ఏపీఎం	27	50,743	62,414
కమ్యూనిటీ కో ఆర్డినేటర్	99	27,486	33,808
ఎంఎస్‌సీసీలు	50	13,320	16,384
ఆఫీసు సిబ్బంది	32	33,591	41,317

ఆనందంగా ఉంది



మాకు 23 శాతం జీతం పెంచి, అందించడం చాలా ఆనందంగా ఉంది. ఆర్థికంగా నిలదొక్కుంటాం. ఉత్సాహంగా పని చేయడానికి ఇదొక అవకాశం. ప్రభుత్వ పథకాలను ప్రతి లబ్ధిదారుకూ చేర్చేందుకు మరింత కృషి చేస్తాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు.

– అశోక్ భరత్, హెచ్‌ఆర్, డీపీఎం, కాకినాడ

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



సెర్ప్ పరిధిలోని వైఎస్సార్ క్రాంతి పథం ఉద్యోగులకు బేసిక్ మీద ఏకంగా 23 శాతం జీతం పెంచడం హర్షణీయం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం మాకు చాలా సంతోషాన్నిచ్చింది. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– టి.శ్రీనివాస్, కమ్యూనిటీ కో ఆర్డినేటర్,తాటిపర్తి క్లస్టర్, గొల్లప్రోలు మండలం

సీఎం జగన్‌కు ధన్యవాదాలు



మా జీతాలు పెంచిన సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు. ఎస్‌హెచ్‌జీల అభివృద్ధిలో కీలకంగా ఉన్న ఉద్యోగులు మరింత ఉత్సాహంతో పని చేయడానికి అవకాశం కల్పించారు. సెర్ప్ ఉద్యోగులంతా సీఎం జగన్‌కు ఎంతో రుణపడి ఉంటాం.

– ఎంఎస్‌టీ దేవి, ఏపీఎం, కరప మండలం

న్యూస్‌రీల్

నేటి నుంచి పంచాయతీ కార్యదర్శుల శిక్షణ

సామర్లకోట: కాకినాడ జిల్లా, అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్ పరిధిలోని పంచాయతీల్లో పని చేస్తున్న కార్యదర్శులకు సోమవారం నుంచి రెండో బ్యాచ్ శిక్షణ ప్రారంభిస్తున్నారు. ఈ శిక్షణ ఆరు రోజుల పాటు నిర్వహిస్తామని స్థానిక విస్తరణ, శిక్షణ కేంద్రం మేనేజర్ పి.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. కాకినాడ జిల్లాలో 100, రంపచోడవరం డివిజన్‌లో 50 మంది శిక్షణకు హాజరవుతున్నారన్నారు. గ్రేడ్–1 నుంచి గ్రేడ్–5 కార్యదర్శులకు శిక్షణ ఇస్తామని, శాశ్వత భూ హక్కుపై ప్రత్యేకంగా శిక్షణ ఉంటుందని వివరించారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ పొందిన కార్యదర్శులతో మున్సిపల్ నోడల్ అధికారి సుజాత

సామర్లకోట: శిక్షణతో అనేక కొత్త విషయాలు తెలుస్తాయని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిఠాపురం మున్సిపల్ నోడల్ అధికారి సీహెచ్ సుజాత అన్నారు. కాకినాడ నగరపాలక సంస్థ, తుని, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీలు, గొల్లప్రోలు, ఏలేశ్వరం నగర పంచాయతీల్లోని సచివాలయ కార్యదర్శులకు స్థానిక టీటీడీసీలో ఇస్తున్న పదో బ్యాచ్ శిక్షణ ఆదివారం ముగిసింది. కంప్యూటర్ డిజిటల్ వ్యవస్థ, సోషల్ మీడియా, సర్వీసు అంశాలు, సచివాలయాల్లో విధుల నిర్వహణపై నాలుగు రోజుల పాటు ఈ శిక్షణ ఇచ్చారు. సచివాలయాల్లోని ఆరు కేటగిరీలకు చెందిన కార్యదర్శులు శిక్షణ పొందారు. ఫ్యాకల్టీ శ్రీకైలాస్ శిక్షణ నిర్వహించగా మున్సిపాలిటీల నోడల్ అధికారులు యు.జ్యోతిరామ్, ఎస్‌వీ రామారావు, కేపీ ప్రసన్న పాల్గొన్నారు. శిక్షణ పొందిన కార్యదర్శులకు సర్టిఫికెట్లు అందజేశారు. సోమవారం నుంచి మొదలయ్యే 11వ బ్యాచ్ శిక్షణతో జిల్లాలోని మున్సిపాలిటీల్లో పని చేస్తున్న సచివాలయ కార్యదర్శుల శిక్షణ పూర్తవుతుందని సుజాత తెలిపారు.

ఏలేరు నుంచి 730 క్యూసెక్కుల విడుదల

ఏలేశ్వరం: ఏలేరు రిజర్వాయర్ నుంచి ఆదివారం 730 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. రైతులు ఖరీఫ్ సాగు చేపట్టడంతో నీటి విడుదలను పెంచారు. ఇదిలా ఉండగా ఎగువ నుంచి 912 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి వచ్చి చేరుతోంది. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం 86.56 మీటర్లు కాగా, ప్రస్తుతం 75.76 మీటర్లుగా ఉంది. సామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా 9 టీఎంసీల మేర నీటి నిల్వ లున్నాయి. ఆయకట్టుకు 600, విశాఖకు 100, పంపాకు 30 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

నేడు యథావిధిగా స్పందన

కాకినాడ సిటీ: జగనన్నకు చెబుదాం జిల్లా స్థాయి స్పందన ప్రజా విజ్ఞాపనల స్వీకార కార్యక్రమం సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో నిర్వహిస్తున్నారు. కలెక్టర్ కృతికా శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. అర్జీదారులు, జిల్లా అధికారులు ఈ విషయం గమనించాలని కోరారు. అలాగే మంగళవారం ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకూ డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 3077కు ఫోన్ చేసి ప్రజలు తమ సమస్యలను నేరుగా తనకు తెలియజేయవచ్చన్నారు.

తలుపులమ్మ దర్శనాలకు పోటెత్తిన భక్తులు



తలుపులమ్మ తల్లిని దర్శించేందుకు క్యూలో ఉన్న భక్తులు

తుని రూరల్: లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ జిల్లాల నుంచి తరలి వచ్చిన పది వేల మంది భక్తులు క్యూలైన్ల ద్వారా తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకున్నారని కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,06,440, పూజా టికెట్లకు రూ.96,770, కేశఖండన శాలకు రూ.10,920, వాహన పూజలకు రూ.2450, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలు రూ.1,01,832, విరాళాలు రూ.1,22,612, కలిపి మొత్తం రూ.4,41,024 ఆదాయం సమకూరిందని వివరించారు.

వేద పఠనంతో పులకించిన పంచారామ క్షేత్రం



వేదసభ నిర్వహించిన దువ్వూరి, విశ్వనాథ తదితరులు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరాలయం ఆదివారం వేద పఠనంతో పులకించింది. శ్రీ బాలాత్రిపుర సుందరి వేదశాస్త్ర పరిషత్తు అధ్యక్షుడు డాక్టర్ చందలాడ అనంతపద్మనాభం, కార్యదర్శి గ్రంధి రామకృష్ణ ఆధ్వర్యంలో 25వ వేదసభ ఘనంగా నిర్వహించారు. సీనియర్ వేద పండితుడు శ్రీపాద రాజశేఖరశర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ దువ్వూరి ఫణి యజ్ఞేశ్వర ఘనపాఠి, దువ్వూరి వెంకట సూర్యప్రకాశ సోమయాజి ఘనపాఠిలు వేదాల గొప్పతనాన్ని వివరించారు. తరచూ వేద పారాయణ జరిగే ప్రాంతాలు ప్రగతి సాధిస్తాయని అన్నారు. సృష్టిలో ప్రతి జీవికి వేద శాస్త్రం అనేక విధాల రక్షణ కలిగిస్తుందని చెప్పారు. వేదాలను సరళమైన రీతిలో ప్రజలకు చేరువ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేయాలని కోరారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి సుమారు 200 మంది వేద పండితులు హిందూ సంస్కృతీ సంప్రదాయాలను వివరిస్తూ చతుర్వేద పారాయణ, వేదస్వస్తి చెప్పారు. వేద పండితులను ఎమ్మెల్సీ అనంత బాబు, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పులి నారాయణమూర్తి, ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు, ఈఓలు వి.నాగమల్లేశ్వర రావు, పారిశ్రామికవేత్తలు బిక్కిన సాయి పరమేశ్వర సాయి సత్యనారాయణ, కటకం సతీష్, శింగవరపు సాయిబాబు, ఎస్.పూర్ణచంద్రరావు, అన్నవరం ట్రస్ట్ బోర్డ్ సభ్యురాలు నేతల వెంకటలక్ష్మి, ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు ఘనంగా సత్కరించారు. లోకకల్యాణార్థం ఏటా వేద సభ నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

రత్నగిరికి భక్తుల తాకిడి

- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది
- రూ.40 లక్షల ఆదాయం



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న నవదంపతులు, భక్తులు

అన్నవరం: వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రత్నగిరిపై సత్యదేవుని ఆలయం ఆదివారం కిటకిటలాడింది. సత్యదేవుని సన్నిధిలో శనివారం రాత్రి, తెల్లవారుజామున 200 వివాహాలు జరిగాయి. ఇవే ముహూర్తాల్లో ఇతర ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న నవ దంపతులు సైతం సత్యదేవుని సన్నిధికి తరలి వచ్చారు. వీరికి సాధారణ భక్తులు తోడయ్యారు. వీరంతా సత్యదేవుని వ్రతాలాచరించి స్వామివారిని, దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మండపాలు, క్యూ లైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. స్వామివారి ఉచిత దర్శనానికి గంట, ప్రదక్షిణ దర్శనానికి అరగంట సమయం పట్టింది. సుమారు 40 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించారని అధికారులు తెలిపారు. వ్రతాలు 3,600 జరిగాయి. సత్యదేవుని దర్శించిన భక్తులు స్వామివారి గోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావి చెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. అన్నదాన పథకంలో 4 వేల మంది భక్తులకు భోజనం పెట్టారు. ఏర్పాట్లను దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ పర్యవేక్షించారు.

సత్యదేవునికి ఏకాదశి పూజలు

శ్రావణ బహుళ ఏకాదశి సందర్భంగా సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి, శంకరుల విగ్రహాలకు ఉదయం ఏడు, 11 గంటలకు స్వర్ణ పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రధానార్చకుడు ఇంద్రగంటి నరసింహమూర్తి, అర్చకుడు వేంకటేశ్వర్లు, వేదపండితులు పాల్గొన్నారు.

ఎలా చేద్దాం!

- నేడు అన్నవరం దేవస్థానం ట్రస్ట్‌బోర్డ్ సమావేశం
- జ్యోతిర్మయి వ్రతంపై చర్చించే అవకాశం
- కార్తిక ఏర్పాట్లు, ఇతర కీలక అంశాల పైనా చర్చ

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు చైర్మన్ ఐవీ రోహిత్ అధ్యక్షతన జరగనుంది. ఈసారి సమావేశానికి 15 మంది సభ్యులతో పాటు (ప్రధానార్చకుడి స్థానం ఖాళీ) ప్రత్యేక ఆహ్వానితులు కూడా హాజరు కానున్నారు. వీరిలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్, కాకినాడకు చెందిన సీహెచ్ సూర్యనారాయణ, మోరంపూడి రంగనాయకులు, మొగలి మాణిక్యాలరావు, గుండుబోగుల బలుసుల రావు, నల్లమిల్లి గాంధీరెడ్డి, ఎస్‌వీవీ సత్యనారాయణ ఉన్నారు. పాలక మండలి సమావేశానికి ప్రకాష్ సదన్ సత్రంలోని ట్రస్ట్ బోర్డ్ సమావేశ మందిరంలో ఏర్పాట్లు చేశారు.

చర్చించే అంశాలివీ..

- సత్యదేవుని సన్నిధిలో విజయ దశమి నుంచి జ్యోతిర్మయి వ్రతం ప్రారంభించాలని ప్రతిపాదించారు. ఎంతో విశిష్టమైనదిగా చెబుతున్న ఈ వ్రతాన్ని ఏవిధంగా నిర్వహించాలి, చేయాల్సిన ఏర్పాట్లు తదితర అంశాలపై ధర్మకర్తల మండలి చర్చించనుంది. రూ.10 వేల టికెట్టుతో ఈ వ్రతం ఏర్పాటు చేయాలని అధికారులు ఆలోచిస్తున్న విషయం తెలిసిందే.
- వివాహ బృందాలు సొంతంగా తయారు చేసుకున్న భోజనాన్ని రత్నగిరి పైకి తీసుకువెళ్తే రూ.6 వేలు చెల్లించాలంటూ ఇటీవల విధించిన నిబంధనపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 20 మందికి సరిపడా భోజనాలు తీసుకువెళ్లినా కూడా అంత మొత్తం చెల్లించాల్సి రావడంపై పెళ్లిబృందాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశాన్ని కూడా ధర్మకర్తల మండలి సమావేశంలో చర్చించనున్నారు. రుసుం తగ్గించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.
- దేవస్థానంలో చేపట్టిన పలు నిర్మాణాలపై కూడా సభ్యులు చర్చించనున్నారు. ప్రధానంగా జాతీయ రహదారిపై సత్యదేవుని నమూనా ఆలయం, మల్టీ లెవెల్ పార్కింగ్, పాత సీఆర్‌ఓ కార్యాలయం వెనుక నుంచి రెండో ఘాట్ రోడ్డు మూడో మలుపు వరకూ చదును చేసిన రోడ్డు, కళాశాల మైదానంలో విశ్రాంతి షెడ్లు వంటి వాటి పురోగతిపై చర్చించే అవకాశం ఉంది.
- ఈ నిర్మాణాలకు నిధులు ఎలా సమకూర్చుతారనే అంశంపై దేవస్థానం అధికారుల్లో చర్చ జరుగుతోంది. దేవస్థానం డిపాజిట్లు విత్‌డ్రా చేయడమో లేక దేవస్థానం చెల్లించాల్సిన రూ.15 కోట్ల కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్), ఇతర చెల్లింపులు వాయిదా వేయడమో చేయాల్సి ఉంటుంది. దీనిపై కూడా సమావేశంలో చర్చించనున్నారు.
- నవంబర్ 14వ తేదీ నుంచి ప్రారంభం కానున్న కార్తిక మాసంలో భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, చేయాల్సిన ఏర్పాట్లపై కూడా ధర్మకర్తల మండలి చర్చించనుంది. 30 వీఐపీ సత్రం కూల్చేస్తున్నందున ఆ స్థలంలో విశ్రాంతి షెడ్డు నిర్మించనున్నారు.
- దేవస్థానంలో జరిగే ప్రతి ఉత్సవంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని మాత్రమే ఊరేగిస్తున్నారు. అయితే స్వామివారి ఆలయంలో సత్యదేవుడు, అమ్మవారితో పాటు ఈశ్వరుడు కూడా ఉంటారు. అందువలన ఇకపై ముగ్గురు మూర్తులనూ కలిపి ఊరేగించాలని నిర్ణయించారు. ఈ మేరకు శివలింగాలు తయారు చేయించే విషయమై కూడా చర్చించనున్నారు.



అన్నవరం దేవస్థానం

15 వేల సచివాలయాల్లో వైద్య శిబిరాలు

- వైద్య, ఆరోగ్య శాఖను సీఎం ప్రక్షాళన చేశారు
- ఆరోగ్యశ్రీలో ప్రొసీజర్ల పెంపు
- ఏపీ ఆరోగ్యశ్రీ ప్రత్యేక అధికారి డాక్టర్ అశోక్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ ఆరోగ్యశ్రీ ప్రత్యేకాధికారి డాక్టర్ అశోక్‌బాబు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 15 వేల సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యశ్రీ ప్రత్యేక అధికారి డాక్టర్ యాదాల అశోక్‌బాబు తెలిపారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో 14 రకాల వైద్య పరీక్షలు, 105 రకాల మందులు, స్పెషలిస్ట్ డాక్టర్లను అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య, ఆరోగ్య శాఖను పూర్తిగా ప్రక్షాళన చేశారన్నారు. గతంలో ఆరోగ్యశ్రీలో 1,059 ప్రొసీజర్లు మాత్రమే ఉండగా దీనిని 3,257కు పెంచారని గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీలో ఇప్పటి వరకూ 50 లక్షల మంది పైగా పేదలు ఉచిత వైద్యం పొందారన్నారు. ఈ పథకానికి ప్రభుత్వం రూ.3,400 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. రోగులకు ఓపీతో పాటు భోజనం, టెస్టులు, సర్జరీలు, ఇంటికి వెళ్లే క్రమంలో చార్జీలు, ఆ తర్వాత విశ్రాంతి సమయంలో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ప్రభుత్వం ఆదుకుంటోందని అశోక్‌బాబు వివరించారు. రాష్ట్రంలో 2.64 లక్షల మంది క్యాన్సర్ చికిత్స పొందారని, దీనికి ప్రభుత్వం రూ.1,800 కోట్లు కేటాయించిందని చెప్పారు. కోవిడ్ సమయంలో కూడా పేదలకు ఉచిత వైద్యం అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని చెప్పారు. వివిధ సేవల ద్వారా రాష్ట్రంలో 1.40 కోట్ల మంది పేదలకు ఉచితంగా వైద్యం అందించామని తెలిపారు. పేదవారి ఆరోగ్యానికి మరింత భరోసా ఇచ్చేలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారన్నారు. ఆరోగ్యశ్రీకి జన్మనిచ్చింది వైఎస్ రాజశేఖరరెడ్డి అయితే పునర్జన్మనిచ్చింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరికీ వైద్యం అందాలనే లక్ష్యంతో సీఎం జగన్ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం అమలు చేస్తున్నారన్నారు. ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఉండాలనే లక్ష్యంతో రాష్ట్రంలో కొత్తగా 17 వైద్య కళాశాలలకు శ్రీకారం చుట్టారని ఆయన తెలిపారు.

పేదల కోసం ఆరోగ్య మిత్రలు పని చేయాలి

ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలందరికీ నాణ్యమైన ఉచిత వైద్యం అందించే దిశగా ఆరోగ్య మిత్రలు పని చేయాలని అశోక్‌బాబు సూచించారు. జిల్లాలోని ఆరోగ్య మిత్ర టీం లీడర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో డబ్బులు వసూలు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే ఆ ఆస్పత్రి ఎంపానెల్మెంట్‌ను రద్దు చేస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరికి ఉచిత వైద్యం అందించి, ఆరోగ్యశ్రీలో జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఆరోగ్యమిత్రల సమస్యలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ పి.ప్రియాంక, జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు డాక్టర్ పద్మలత, కాకినాడ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మల్లికార్జున్, పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సుందర్ రామరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సంపదను ప్రజలకు చేరువ చేసేందుకు సీఎం కృషి

- మెరైన్ జేడీ వెంకటేశ్వరరావు
- ముగిసిన ఆక్వా – సీ ఫుడ్ ఫెస్టివల్



రూరల్ మత్స్యశాఖ అధికారిని సత్కరిస్తున్న మెరైన్ జేడీ వెంకటేశ్వరరావు తదితరులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాష్ట్రంలో ఫిష్ ఆంధ్రా పేరుతో అవుట్‌లెట్లు ఏర్పాటు చేసి, మత్స్యసంపదను ప్రజలకు చేరువ చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర మత్స్యశాఖ కార్యాలయ మెరైన్ జాయింట్ డైరెక్టర్ వి.వెంకటేశ్వరరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ మత్స్యశాఖ ఆధ్వర్యాన భూమి ఆర్గానిక్ సంస్థ సహకారంతో స్థానిక మంజీర కన్వెన్షన్ సెంటర్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన నాలుగో ఆక్వా – సీ ఫుడ్ ఫెస్టివల్ ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మెరైన్ జేడీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో మత్స్య శాఖ ద్వారా ఏటా 50 లక్షల మెట్రిక్ టన్నుల మత్స్య ఉత్పత్తులు లభ్యమవుతున్నాయని చెప్పారు. వీటి ఎగుమతిలో దేశంలోనే రాష్ట్రం అగ్రగామిగా ఉందని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఇప్పటి వరకూ 2 వేల ఫిష్ ఆంధ్రా స్టాల్స్ ఏర్పాటు చేసిందన్నారు. జిల్లా మత్స్య శాఖాధికారి వి.కృష్ణారావు మాట్లాడుతూ, కడియం మత్స్య శాఖ ద్వారా శిక్షణ పొందిన ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించామని చెప్పారు. భూమి ఆర్గానిక్స్ ఎండీ రఘురామ్ కూడా ప్రసంగించారు. ఈ ఫెస్టివల్‌లో తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన ఆక్వా రైతులు, సీ ఫుడ్ ప్రియులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ రకాల చేపలు, రొయ్యలు, పీతలతో 24 స్టాల్స్ ఏర్పాటు చేశారు. అలాగే, సీఫుడ్‌కు సంబంధించి పచ్చళ్లు, ఊరగాయలు అందుబాటులో ఉంచారు. ప్రత్యేకించి చేపలు, రొయ్యలు, పీతల కూరలు ఘుమఘుమలాడాయి. ఫెస్టివల్ సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ, చర్చా అంశం పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మత్స్య శాఖ అధికారులు వీవీ రావు, లాల్ మహమ్మద్, పీవీ సత్యనారాయణ, ఆర్‌వీఎస్ ప్రసాద్, జాన్ బాషా, సెంట్రల్ సభ్యులు వి.కృష్ణయ్య, ఏడీ పవన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి సెమిస్టర్ పరీక్షలు వాయిదా

రాజానగరం: అనివార్య కారణాలతో సోమవారం నిర్వహించాల్సిన పీజీ (ఎంబీఏ, ఎంసీఏ) రెండో సెమిస్టర్, ఎంఈడీ నాలుగో సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేశారు. ఈ మేరకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ పరీక్షలు తిరిగి ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామన్నారు.

సీఎంఆర్ జ్యూయలర్స్ ప్రారంభం



సీఎంఆర్ జ్యూయలరీ షాపును ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి

తుని: స్థానిక మెయిన్ రోడ్డులో సీఎంఆర్ జ్యూయలర్స్ 16వ బ్రాంచ్‌ను ఆదివారం ప్రారంభించారు. మంత్రి దాడిశెట్టి రాజా తండ్రి దాడిశెట్టి శంకరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి జ్యోతిప్రజ్వలన చేసి షోరూమ్‌ను ప్రారంభించగా, ప్రముఖ వ్యాపారవేత్త చెక్కా తాతబాబు మొదటిగా బంగారు ఆభరణాలు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి మాట్లాడుతూ తుని పట్టణంలో సీఎంఆర్ జ్యూయలరీ షాపును ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. సీఎంఆర్ డైరెక్టర్ మావూరి మోహన బాలాజీ పాల్గొన్నారు.

పిడుగుపడి పెంకుటిల్లు ధ్వంసం



పిడుగుపడి ధ్వంసమైన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: రామన్నపాలెంలో ఆదివారం తెల్లవారు జామున జొన్నకూటి సుబ్బారావు పెంకుటింటిపై పిడుగుపడి పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనలో సుమారు రూ.2 లక్షల నష్టం జరిగినట్టు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేష్ తెలిపారు. చుట్టపక్కల ఇళ్లలోని ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు, టీవీలు, ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువులు కాలిపోయినట్టు ఆయన వివరించారు. ధ్వంసమైన గృహాన్ని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పరిశీలించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.5 వేల నగదు, 20 కిలోల బియ్యం, నిత్యావసర సరకులు ఆయన అందజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సహాయం వచ్చే విధంగా కృషి చేస్తానని తెలిపారు. సర్పంచ్ కూచిపూడి బుల్లయ్య, ఎంపీటీసీ సభ్యుడు సత్తి జగదీశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ కూచిపూడి వెంకటేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆటకు సై

- స్కూల్ గేమ్స్‌కు రంగం సిద్ధం
- ఐదు స్థాయిల్లో క్రీడా పోటీలు
- అండర్–11, 14, 17, 19 విభాగాల్లో ఎంపికలు
- నేటి నుంచి నియోజకవర్గ స్థాయి పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): నువ్వా నేనా అంటూ జరిగే క్రీడా సమరానికి గంట మోగింది.. పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో స్కూల్ గేమ్స్‌కు సర్వం సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ పరిధిలోని ఎస్‌జీఎఫ్‌ఐ జిల్లా శాఖ మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి ఎంపికలకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రాతిపదికగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధికారులు, పీఈటీ సంఘ సభ్యులు ఈ ఎంపికలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్నీ సిద్ధం చేశారు. గత టీడీపీ హయాంలో స్కూల్ గేమ్స్ ఎంపికలు, పోటీలు జరిగాక నిధులు అందించేవారు. దీంతో నిర్వహణ ఇబ్బందిగా ఉండేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సమగ్రశిక్షాభియాన్ నిధుల నుంచి పాఠశాల క్రీడా సమాఖ్య పోటీలు, ఎంపికలకు నిధులు ముందుగానే మంజూరు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ ఏడాది రూ.7.42 కోట్ల నిధులు రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల్లో పోటీల నిర్వహణ, క్రీడాకారుల ఎంపికకు, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు క్రీడాకారులను పంపడానికి, వారికి క్రీడా దుస్తులు అందించేందుకు మంజూరు చేశారు. ఇది క్రీడలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాన్ని తెలియజేస్తోంది.

నేటి నుంచి నియోజకవర్గ పోరు

స్కూల్ గేమ్స్ అండర్–14, 17 పోటీలలో భాగంగా సోమవారం నుంచి 16 వరకూ నియోజకవర్గ స్థాయి ఎంపికలు ప్రారంభం కానున్నాయి. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నీకాయిట్, యోగా అంశాల్లో ఎంపికలకు నిర్వాహకులు ఇప్పటికే వేదికలను, ఇన్‌చార్జులను ఖరారు చేశారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు వారి నియోజకవర్గంలో ఎంపిక చేసిన కేంద్రాల్లో జరిగే పోరులో పోటీ పడతారు. అక్కడ ఎంపిక చేసిన జట్లు జిల్లా స్థాయి ఎంపిక పోటీలకు నేరుగా అర్హత సాధిస్తారు. వీరితో పాటు మిగిలిన మరో 23 క్రీడాంశాలతో కలిపి జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో తలపడతారు.



కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీలు (ఫైల్)

జిల్లా స్థాయిలో 32 క్రీడాంశాలు

జిల్లా స్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య ఎంపిక పోటీలు మొత్తం 32 క్రీడాంశాల్లో జరగనున్నాయి. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్, తైక్వాండో, జూడో, సెపక్‌తక్రా, హాకీ, టెన్నిస్, రెజ్లింగ్, బాస్కెట్‌బాల్, ఫెన్సింగ్, చెస్, బాల్ బ్యాడ్మింటన్, స్విమ్మింగ్, రోలర్ స్కేటింగ్, ఆర్చరీ, బాక్సింగ్, రగ్బీ, వెయిట్ లిఫ్టింగ్, సాఫ్ట్‌బాల్, రోప్ స్కిప్పింగ్ క్రీడాంశాల్లో ఎంపికలు జరుగుతాయి.

స్కూల్ గేమ్స్‌కు అర్హులు ఎవరంటే..

స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు అండర్–11 (స్కేటింగ్), 14, 17, 19 వయో విభాగాల్లో బాల బాలికలకు వేర్వేరుగా జరుగుతాయి. పాఠశాల విద్య పరిధిలో అండర్–14, 17 విభాగాలు, ఇంటర్మీడియేట్ విద్య పరిధిలో అండర్–19 ఎంపికలు ఉంటాయి. అండర్–14 బాలబాలికలు 2010 జనవరి ఒకటి, అండర్–17కు 2007 జనవరి ఒకటి, అండర్–19కు 2005 జనవరి ఒకటి తర్వాత జన్మించి ఉండాలి. అండర్–14కు 8వ తరగతి చదువుతూ, అండర్–17కు ఇంటర్ ఫస్ట్‌ఇయర్, అండర్–19కు డిగ్రీ ఫస్ట్ ఇయర్ లోపు చదువుతూ ఉండాలి.

రిజిస్ట్రేషన్ తప్పనిసరి

స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొనే బాలబాలికలు స్కూల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ (ఎస్ఈఎం) యాప్‌లో తప్పనిసరిగా తమ వివరాలు నమోదు చేసుకోవాలి. పారదర్శకత కోసం ఈ ఏడాది మొదటిసారిగా ఈ విధానాన్ని తీసుకు వచ్చారు. ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేట్ అన్ని యాజమాన్యాల పాఠశాలలు, జూనియర్ కళాశాల విద్యార్థులు వారి యూ–డైస్ కోడ్‌తో పాఠశాల పాస్‌వర్డ్ ద్వారా లాగిన్ కావాలి. అందులో ఎస్‌జీఎఫ్ పోర్టల్‌లో క్రీడాకారులు తమ వివరాలు నమోదు చేయాలి.

పారదర్శకంగా పోటీలు



విద్యార్థి జీవితంలో కీలకమైన స్కూల్ గేమ్స్‌ను అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. వారు శిక్షణ పొందుతున్న క్రీడలో ప్రతిభ చాటాలి. ఈ ఏడాది రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు హాజరయ్యే బాలికల జట్లతో పాటు మహిళా పీఈటీని మేనేజర్‌గా పంపించాలనే నిబంధన పెట్టాం. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– జి.భానుమూర్తిరాజు, ఐపీఈ, రాష్ట్ర పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి

పూర్తి స్థాయిలో ఏర్పాట్లు



జిల్లాలో స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీల నిర్వహణకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నాం. డీఈఓ నేతృత్వంలో పీఈటీ సంఘ నాయకులు, ఎంఈఓలు, నియోజకవర్గ స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ల సమన్వయంతో పోటీల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. తొలుత జిల్లాలో అత్యంత ఆదరణ కలిగిన 9 క్రీడాంశాల్లో మండల, నియోజకవర్గ స్థాయి ఎంపికలు జరుగుతాయి. ఆ తర్వాత జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహిస్తాం.

– ప్రసాద్, పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి

ఇక్కడ ఎంపిక చేసిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరఫున పాల్గొనున్నారు. పోటీల్లో అన్ని స్థాయిల్లో పాల్గొనే క్రీడాకారులకు మిడ్ డే మీల్స్‌లో భోజన సౌకర్యం కల్పించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

స్వామిని కొలిచి.. తన్మయత్వంతో మురిసి



శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువు దీరిన శ్రీబాల బాలాజీస్వామి

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. తొలుత పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఉభయ దేవేరులతో కొలువు దీరిన స్వామివారిని దర్శించుకుని తన్మయత్వం చెందారు. స్వామివారికి వివిధ సేవల ద్వారా రూ.1.45 లక్షల ఆదాయం సమకూరింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1.09 లక్షలు, నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.35,749 విరాళాలుగా వచ్చాయని ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ తెలిపారు. 2,583 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా 1,745 మంది అన్న ప్రసాదం స్వీకరించారన్నారు.

కిక్కిరిసిన అయినవిల్లి



అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో లక్షగరిక పూజలు చేస్తున్న పండితులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఉదయం స్వామివారికి ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో మేలుకొలుపు సేవ చేశారు. స్వామివారి పంచామృత, ప్రత్యేక అభిషేకాల్లో 62 మంది, ప్రత్యేక దర్శనంలో 324 మంది, శ్రీలక్ష్మీ గణపతి హోమంలో 38 మంది పాల్గొని పూజలు చేశారు. 65 మంది చిన్నారులకు నామకరణం, అక్షరాభ్యాసం, అన్నప్రాశన, తులాభారం తదితరాలు నిర్వహించారు. స్వామికి ఆరుగురు తలనీలాలు సమర్పించగా, 16 మంది వాహన పూజ చేయించుకున్నారు. వేయవరం వాసి సుబ్రహ్మణ్యశర్మ కుటుంబ సభ్యులు స్వామివారికి లక్ష గరిక పూజ చేశారు. స్వామివారికి వివిధ సేవల ద్వారా రూ.1,88,375 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

జీజీహెచ్ నుంచి బాలింత అదృశ్యం



గొర్ల వరలక్ష్మి

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌లో కవలలను ప్రసవించిన ఓ బాలింత అదృశ్యం కావడం చర్చనీయాంశమైంది. కాకినాడ రూరల్ మండలం స్వామినగర్ ప్రాంతానికి చెందిన గొర్ల వరలక్ష్మి (29) దివ్యాంగురాలు. పుట్టుక నుంచి మూగ, చెవిటితో బాధపడుతోంది. ఈ నెల 31న జీజీహెచ్‌లో చేరిన ఆమె అదే రోజు ఇద్దరు కవల ఆడ శిశువులకు జన్మనిచ్చింది. ఆమెను ప్రసవానంతర వైద్య సేవల కోసం పోస్ట్ నాటల్ వార్డుకు తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం ఆమెకు ఆసుపత్రిలో సంరక్షకురాలిగా వ్యవహరిస్తున్న బంధువు ఇంటి నుంచి ఆసుపత్రికి వెళుతున్న క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురైంది. ఆ విషయం తెలుసుకున్న వరలక్ష్మి వద్ద సంరక్షణ కోసం ఉన్న మరో మహిళ ఆమెను చూసి వచ్చేందుకు వెళ్లింది. అదే సమయంలో వరలక్ష్మి వార్డు నుంచి బయటకు వెళ్లింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో జీజీహెచ్ అధికారులు అంతా వెతికారు. అనంతరం సీసీ టీవీ ఫుటేజీలు పరిశీలించగా బాలింత తనకు తానే నడుచుకుంటూ ఆసుపత్రి ప్రధాన ద్వారం దాటి రోడ్డుపైకి వెళ్లడం స్పష్టంగా కనిపించింది. ఈ నేపథ్యంలో ఆసుపత్రి అధికారులు బాలింత అదృశ్యంపై కాకినాడ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



కరాటే పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులతో లయన్స్ క్లబ్ ప్రతినిధులు

సామర్లకోట: విశాఖపట్నం స్వర్ణభారతి స్టేడియంలో ఈ నెల 2, 3 తేదీల్లో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన కరాటే జట్టుకు మొదటి నేషనల్ ఓవరాల్ చాంపియన్‌షిప్ లభించిందని ఉమ్మడి జిల్లా కరాటే కోచ్ డి.శంకర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో విజేతలకు అభినందన కార్యక్రమం జరిగింది. లయన్స్ క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్, జిల్లా అధ్యక్షుడు చిత్తూలూరి వీర్రాజు, క్లబ్ అధ్యక్షుడు కానుబోయిన విజయకృష్ణ మాట్లాడుతూ సుమారు దశాబ్ద కాలంగా సామర్లకోట విద్యార్థులకు శంకర్ శిక్షణ ఇస్తున్నారన్నారు. ప్రతి ఏటా శంకర్ ఆధ్వర్యంలో విద్యార్థులు బహుమతులు సాధిస్తున్నారన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి 120 మంది క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నట్లు కోచ్ శంకర్ తెలిపారు. ఈ పోటీల్లో కాకినాడ, సామర్లకోటలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపడంతో ఓవరాల్ చాంపియన్ షిప్ దక్కిందన్నారు. క్లబ్ కార్యదర్శి ఎస్ఆర్‌వీ ప్రసాద్, కోశాధికారి బడుగు సీతారామరాజు తదితరులు విజేతలను అభినందించారు.



సాధించిన పతకాలతో పల్లవి

స్విమ్మింగ్ పోటీల్లో..

పెద్దాపురం: మహారాష్ట్ర పూణేలో జరిగిన జాతీయ స్థాయి రన్నింగ్, స్విమ్మింగ్ పోటీల్లో పెద్దాపురం మండలం ఆర్‌బీ పట్నం గ్రామ విద్యార్థి పల్లవి ఉత్తమ ప్రతిభ కనబరిచింది. అండర్–11 కేటగిరీలో పోటీపడిన పల్లవి రెండు ఈవెంట్లలో తృతీయ స్థానం సాధించింది. ఆమెను పలువురు అభినందించారు.

రేషన్ బియ్యం స్వాధీనం



జి.రాగంపేటలో పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

పెద్దాపురం: జి.రాగంపేట గ్రామంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ అధికారులు ఆదివారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. అక్కడ గంటా సాయిబాబు ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు ఐదు టన్నుల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 96 సంచుల్లో ఈ బియ్యం ఉన్నట్లు అందిన సమాచారం మేరకు విజిలెన్స్ సీఐ ఎన్.రమేష్, ఎంఎస్ఓ విజయకుమారి, వీఆర్వో వెంకటేశ్వరరావు, జీవన్‌కుమార్ బృంద సభ్యులు దాడులు నిర్వహించారు. ఈ బియ్యం విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని, బియ్యాన్ని సీజ్ చేసి అతనిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు ఎంఎస్ఓ తెలిపారు.

ఎమ్మెల్యే పొన్నాడకు రూ.లక్ష చెక్కు అందజేత



ఎమ్మెల్యే పొన్నాడకు చెక్కు అందజేస్తున్న సంఘ సభ్యులు

ముమ్మిడివరం: ఐ.పోలవరం మండలం యానాం–ఎదుర్లంక వారధి వద్ద పాత ఇంజరంలో పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ నిర్మాణానికి కోటిపల్లి గ్రామానికి చెందిన అగ్నికుల క్షత్రియ సంఘం సభ్యులు రూ.లక్ష విరాళంగా అందజేశారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు ఆదివారం ఈ మొత్తం చెక్కును అందించారు. గ్రామ సర్పంచ్ పెమ్మాడి సత్తిబాబు, సంఘ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

లారీల ఢీ: ముగ్గురికి తీవ్ర గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రంజిత్‌రెడ్డి



ప్రమాదానికి గురైన రెండు లారీలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తి 16వ నంబరు జాతీయ రహదారిపై ఆదివారం రెండు లారీలు బలంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలైనట్లు గొల్లప్రోలు ఎస్సై వినయ్ ప్రతాప్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బళ్లారికి చెందిన ఉటుకూరి రంజిత్‌రెడ్డి తన లారీపై బొగ్గు లోడు వేసుకుని చెన్నై నుంచి విశాఖపట్నం బయలుదేరాడు. చెందుర్తి 16వ నంబరు జాతీయ రహదారిపై వెళ్తుండగా రాజస్థాన్ రాష్ట్ర బర్దపూర్ జిల్లా మెంటుకాకు చెందిన జామ్‌షేట్ కాన్, రిజ్వికాన్‌లు మరో లారీపై విశాఖపట్నం నుంచి వస్తూ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని ఇవతల వైపు వెళుతున్న లారీని ఢీకొట్టారు. దీంతో రెండు లారీల కేబిన్లు నుజ్జునుజ్జు కావడంతో లారీల్లో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో రంజిత్‌రెడ్డి లారీ కేబిన్‌లో ఇరుక్కు పోగా పోలీసులు అతనిని బయటకు తీసి, మిగిలిన ఇద్దరితో కలిపి 108లో ప్రత్తిపాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు.

ఉపాధి కోసం వెళ్లి తిరిగిరాని లోకాలకు..

- ఒమన్‌లో మహిళ మృతి



నాగవేణి (ఫైల్)

అంబాజీపేట: పేదరికంతో బాధపడుతూ బతుకు దేవుడా అంటూ.. అయినవారిని వదిలి దేశం కాని దేశం వెళ్లిన ఓ వివాహిత గుండెపోటుతో మరణించింది. తమ కష్టాలు గట్టెక్కుతాయని అనుకున్న ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. మరో ఆరు నెలల్లో తిరిగి స్వదేశానికి వచ్చి కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతామని అనుకున్న ఆమె ఆశలు ఆవిరి అయ్యారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. ఇసుకపూడిలోని గూటంవారి పేటకు చెందిన సరెళ్ల నాగవేణి (58) పొట్టకూటి కోసం ఏడాదిన్నర కిందట మస్కట్‌లోని ఒమన్‌కు వెళ్లినట్లు ఆమె కుమారుడు శ్రీనివాస్ తెలిపారు. ఆరేళ్ల కిందట తన తల్లి ఉపాధి నిమిత్తం అక్కడికి వెళ్లిందని, తిరిగి వచ్చాక రెండేళ్లు ఇంటి వద్ద కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపిందన్నారు. మరోసారి ఒమన్‌కు ఉపాధికి వెళితే తమ కష్టాలు తొలగిపోయి కుటుంబమంతా సంతోషంగా ఉండవచ్చని ఏడాదిన్నర కిందట తన తల్లి మళ్లీ వెళ్లిందని వివరించారు. ఈ నేపథ్యంలో 5న నాగవేణికి గుండెపోటు రావడంతో ఒమన్‌లోని బ్రదర్ అల్సమా సోహార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం వచ్చింది. మస్కట్‌లోని ఇంటర్నేషనల్ అంబేడ్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో నాగవేణి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకు వస్తున్నారు. మృతదేహాన్ని తీసుకు వచ్చేందుకు కృషి చేసిన అంబేడ్కర్ సేవాసమితి ఫౌండర్, చైర్మన్ గాలి గనిరాజు, వైస్ చైర్మన్ మెడపట్ల లక్ష్మణ్, మహిళా అధ్యక్షురాలు జి.అంజలిరెడ్డి, అంబేడ్కర్ సేవా సమితి మహిళా అధ్యక్షులు కొనుకు దేవి, కరుణకుమారి, రాజు తదితరులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.